క్లుప్తంగా

నేడు గ్రామ సచివాలయ భవనం ప్రారంభం



ప్రారంభానికి సిద్ధమైన భవనం

పెద్దముడియం : మండల పరిధి భీమగుండం గ్రామంలోని నూతన గ్రామ సచివాలయ భవనాన్ని సోమవారం ఉదయం 8.30 గంటలకు ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో వెంకటరమణయ్య తెలిపారు. గ్రామంలో చేపట్టిన సచివాలయ భవన నిర్మాణ పనులు 100 శాతం పూర్తి అయ్యాయని ఆయన పేర్కొన్నారు. మండలంలో ఇప్పటికే పెద్దపసుపుల–1, జె.కొత్తపల్లె, పాలూరు గ్రామాలలో సచివాలయాలు ప్రారంభించడం జరిగిందన్నారు.

సండే సందడి



శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో చిన్నారులు

పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని శిల్పారామంలో సండే సందడి వాతావరణం నెలకొంది. మాస్టర్ శబరీష్, ఎస్ ఆర్ డ్యాన్స్ అకాడమి శిష్య బృందంచే శాస్త్రీయ, జానపద నృత్యంతోపాటు సినీ గీతాలకు ఆదివారం స్టెప్పులు వేసి అలరించారు. ఏకదంతాయ వక్రతుండాయ శాస్త్రీయ నృత్యంతో ప్రారంభించి ఓరి మగడా వయ్యారి మగడా, పుష్పాంజలి, భరత వేదముగ నిరత నాట్యముగ కదిలిన పదమిది ఈశ, చమ్కీల అంగీలేసి ఓ వదినే, పాటకు ప్రాణం పల్లవి అయితే అనే జానపద, సినీగీతాలతో అందరినీ మెప్పించారు. శిల్పారామం పరిపాలనాధికారి సుధాకర్ పర్యవేక్షించారు.

కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి

కడప కార్పొరేషన్ : మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నగర అధ్యక్షుడు సుంకరి రవి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద డ్రైవర్ల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ముందు కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామని చెప్పిన ప్రభుత్వం మాట తప్పిందన్నారు. కరోనా సమయంలో మున్సిపల్ కార్మికులను ఫ్రంట్ లైన్ వారియర్స్ అని ప్రకటించి, జీతాల విషయంలో తాత్సారం చేస్తున్నారన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయకపోతే నిరవధిక పోరాటాలు తప్పవని హెచ్చరించారు. డ్రైవర్ల కమిటీ అధ్యక్షుడు వి. శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు విషయంలో మున్సిపల్ కార్మికులపై పక్షపాత ధోరణి ప్రదర్శిస్తున్నారన్నారు. కార్మిక నాయకులు కె. శ్రీరామ్, కిరణ్‌కుమార్, బాలాజీ, శ్రీను, ఆషిబాబు, శ్రీను, ఇమ్మానియేల్ పాల్గొన్నారు.

కాలభైరవునికి పూజలు

కడప కల్చరల్ : కడప నగర సమీపంలోని కాలభైరవపురంలోగల శ్రీ ఇష్టకామ్యార్థ కాలభైరవ స్వామి ఆలయంలో ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు, బాసట స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మేరువ బాలాజీరావు ఆధ్వర్యంలో అర్చకులు శ్రీధర్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకే మూలమూర్తికి పంచామృతాభిషేకం, అష్టోత్తరం నిర్వహించారు.

రేపు చలో విజయవాడ

కడప వైఎస్సార్ సర్కిల్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 20న చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మద్దిలేటి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 నుంచి పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రోటరీక్లబ్ కార్యాలయంలో ఆదివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కీళ్లనొప్పుల వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఎం.అక్షిత్ కుమార్ 180 మంది రోగులను పరీక్షించి వారికి తగిన సూచనలు, సలహాలతో పాటు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు రామకృష్ణ, సెక్రటరీ బాలసూర్యారావు రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక లక్ష్య కార్డియాక్, కంటి ఆస్పత్రిలో ఆదివారం ఉచిత కంటి, గుండె జబ్బుల వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి నెల మూడో ఆదివారం పేదలకు ఉచితంగా కంటి, గుండెజబ్బుల వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని చెప్పారు. వైద్య శిబిరంలో డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి 40 మంది రోగులకు ఉచితంగా పరీక్షలు చేయగా, 6 మందికి గుండె స్కానింగ్ పరీక్షలు చేసి చికిత్స అందించి సూచనలు చేశారు.

జాతీయ రహదారి వైపు అడుగులు

- 84 కి.మీ. రహదారి నిర్మాణానికి రూ.1048 కోట్ల మంజూరు
- మండలంలో ప్రారంభమైన భూసేకరణ
- పెన్నానదిపై మరో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం



జగనన్న కాలనీలో పోతున్న నేషనల్ హైవే

జమ్మలమడుగు : జాతీయ రహదారి నిర్మాణం కోసం అడుగులు శరవేగంగా కదులుతున్నాయి. ఇప్పటికే పెద్దముడియం, జమ్మలమడుగు ప్రాంతాలలో రెవెన్యూ అధికారులు రైతుల నుంచి భూసేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ రహదారి నిర్మాణం జరిగితే జమ్మలమడుగు, కోవెలకుంట్ల, నంద్యాల వరకు జాతీయ రహదారిగా మారి ప్రయాణం సులభతరం కానుంది. మొత్తం 84 కిలోమీటర్ల జాతీయ రహదారి నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం 1048 కోట్ల రూపాయలు మంజూరు చేసింది.

తెలంగాణ రాష్ట్రం మహబూబ్ నగర్ జిల్లా కల్వకుంట్ల నుంచి నంద్యాల వరకు ఉన్న 167 నేషన్‌హైవేను పొడిగిస్తున్నారు. ఇందులో భాగంగా డబుల్ లైన్‌గా ఉన్న నంద్యాల–జమ్మలమడుగు రహదారి రోడ్లను జాతీయ రహదారిగా మార్చుతున్నారు. పది మీటర్ల వెడల్పు ఇరువైపులా మూడున్నర మీటర్ల బరమ్‌తో సువిశాలమైన రోడ్డు ఏర్పాటు చేయబోతున్నారు. ఈ జాతీయ రహదారి నిర్మాణం కోసం డీపీఆర్ (డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు) ప్రక్రియ పూర్తి చేశారు. నంద్యాల–జమ్మలమడుగు జాతీయ రహదారి నిర్మాణానికి పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే నిధులు కేటాయిస్తుంది.

రూ.1048 కోట్ల నిధులతో..

నంద్యాల నుంచి జమ్మలమడుగు వరకు 84 కిలోమీటర్ల జాతీయ రహదారి నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం 1048 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసింది. నంద్యాల జిల్లాలోని కానాల, గోస్పాడు, కోవెలకుంట్ల, సంజామల మండలం, నొస్సం మీదుగా పెద్దముడియం మండలం పాపాయపల్లి, నాగిరెడ్డిపల్లె గుల్లకంట్ల, ఎస్.ఉప్పలపాడు, మోరగుడి, జమ్మలమడుగు, కన్నెలూరు మీదుగా పెన్నానది అంబవరం వేమగుంట్లపల్లి మీదుగా ముద్దనూరు జాతీయ రహదారి 67లో కలుపనున్నారు.

ఈ జాతీయ రహదారి నిర్మాణంతో పాటు మరమ్మతులను పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే భరించబోతుంది. నంద్యాల జిల్లాలో మొత్తం 62 కిలోమీటర్ల నిర్మాణానికి 850 కోట్ల రూపాయలు కేటాయించింది. వైఎస్సార్ జిల్లా పెద్దముడియం మండలం పాపాయపల్లె నుంచి జమ్మలమడుగు మండలంలోని వేమగుంటపల్లి వరకు మొత్తం 22 కిలోమీటర్ల దూరం నిర్మాణం కోసం 198 కోట్ల రూపాయలు కేటాయించింది.

పలు రాష్ట్రాలకు అనుసంధానం

జమ్మలమడుగు–నంద్యాల జాతీయ రహదారి ఏర్పాటుతో పలు రాష్ట్రాల రహదారులకు అనుసంధానం కానుంది. రాష్ట్రంలోని పలు ప్రధాన నగరాలతోపాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలోని హైదరాబాద్, చెన్నై, బళ్లారి ప్రాంతాల వైపు ప్రయాణించే వారికి ప్రయాణం మరింత సులభతరం కానుంది.

రెవెన్యూ సర్వే ప్రారంభం అవుతుంది

జమ్మలమడుగు–నంద్యాల జాతీయ రహదారి నిర్మాణం కోసం నంద్యాల జిల్లాలో భూ సర్వే చేపట్టారు. వైఎస్సార్ జిల్లాలో జాతీయ రహదారి కోసం లైనింగ్ పూర్తి చేయడం జరిగింది. రైతుల వద్ద నుంచి భూసేకరణ ప్రక్రియను రెవెన్యూ అధికారులు చేపడుతున్నారు. ఈ జాతీయ రహదారిలో భాగంగా పెన్నానదిలో హైలెవల్ వంతెన నిర్మాణం కూడా చేపట్టబోతున్నాం.

– సురేంద్రారెడ్డి, ఏఈ, జాతీయ రహదారి

గంగమ్మా.. కాపాడమ్మా



చింతకొమ్మదిన్నె : ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చింతకొమ్మదిన్నె : కొత్తపేట–బుగ్గలేటిపల్లి సరిహద్దులో గల గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు చన్నీటి స్నానాలు ఆచరించి అభిషేకాలు నిర్వహించారు. శాంతించమ్మా... గంగమ్మా అంటూ రైతులు వేడుకున్నారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలు, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి సురేష్ కుమార్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. పోతురాజు వద్ద ముద్దలను ఏరాటు చేసి జంతుబలులు ఇచ్చారు. అనంతరం ఆలయ ఆవరణలోని పచ్చని చెట్ల మధ్య బంధుమిత్రులతో విందుభోజనాలను ఆరగించారు. అలాగే ఆలయ సమీపంలోని ఆంజనేయస్వామి, సాయిబాబా, వైద్యనాథేశ్వరుడు, అక్కదేవతలు, వీరభద్రుడు, నవగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అచ్చివెళ్లి గంగమ్మకు ప్రత్యేక పూజలు

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని అచ్చివెళ్లి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోర్కెలు తీర్చే తల్లిగా ప్రసిద్ధి గాంచారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచే కాక అనంతపురం, కర్నూలు జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కోర్కెలు తీరిన భక్తులు జంతు బలులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

చల్లంగా చూడు తల్లీ

వీరపునాయునిపల్లె : మండల పరిధిలోని తలపనూరు పంట పొలాల్లో వెలసిన గంగమ్మ తల్లికి ఆదివారం చల్లంగా చూడు తల్లీ అంటూ పూజలు చేశారు. అమ్మవారిని ఆలయ అర్చకులు రంగు రంగుల పుష్పాలతో అలంకరించారు. ఉదయం నుంచి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పెండింగ్ ప్రాజెక్ట్‌ల పూర్తి కోసం పోరు




సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

కమలాపురం : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్ట్ పనులను సత్వరం పూర్తి చేయాలని, దీని కోసం త్వరలో ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు సీపీఐ కమలాపురం నియోజకవర్గ కార్యదర్శి పి.చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం కమలాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కమలాపురం నియోజకవర్గానికి ఆయువు పట్టు అయిన గాలేరు–నగరి ప్రధాన కాలువ పనులు ఏళ్లు గడుస్తున్నా ఇంకా పెండింగ్ లోనే ఉన్నాయన్నారు. జీఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువ పనులు నత్తనడకన సాగుతున్నాయని, ఈ పనులను పూర్తి చేస్తే సర్వారాయసాగర్‌కు గండికోట నుంచి మూడు టీఎంసీల సాగునీరు నింపవచ్చన్నారు. సర్వారాయసాగర్ పిల్ల కాలువ పనులను ఇప్పటికీ ప్రారంభించలేదన్నారు. జీఎన్ఎస్ఎస్ రెండవ దశ పనులను తక్షణం ప్రారంభించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో సీపీఐ ఆధ్వర్యంలో ప్రాజెక్టుల కోసం ఉద్యమాలు చేపడుతున్నామన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కొమ్మద్ది ఈశ్వరయ్య, మండల కార్యదర్శి వరప్రసాద్, ఏరియా కార్యవర్గ సభ్యులు ప్రకాష్, అమ్ములు, రఘు తదితరులు పాల్గొన్నారు.

దశల వారీగా సీపీఐ పోరాటం

ఎర్రగుంట్ల : జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ప్రాజెక్టుల నిర్మాణాల పూర్తయ్యేందుకు రాబోయే రోజుల్లో సీపీఐ దశల వారీగా పోరాటాలకు సిద్ధమవుతోందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గుంటి వేణుగోపాల్, గంగాసురేష్ తెలిపారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సీపీఐ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ నెల 24, 25, 26వ తేదీలలో వీఎన్‌పల్లి మండలంలోని సంగమేశ్వర దేవాలయంలో శిక్షణ తరగతులు జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ప్రసాద్, ఎంవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాంసం దుకాణాల పరిశీలన



మాంసం దుకాణాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

పులివెందుల టౌన్ : పట్టణంలోని మాంసం దుకాణాల యజమానులు నాణ్యమైన మాంసం అందించాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన పులివెందులలో మాంసం, చికెన్ దుకాణాలను పరిశీలించారు. ఎక్కడా ప్లాస్టిక్ వాడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మున్సిపాలిటీ నిర్ధారించిన ధరలు తెలిపే పట్టికలను ఏర్పాటు చేయాలని వారికి సూచించారు. షాపుల వద్ద శుభ్రత పాటించాలన్నారు. స్థానిక రాణితోపు వద్దగల ఎఫ్ఎం మటన్ షాపును మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌తో కలసి పరిశీలించారు. ప్రజలకు రూ.699లకే కిలో మటన్ ఇస్తుండటమే కాకుండా పరిశుభ్రతతోపాటు డాక్టర్ సర్టిఫై చేసిన జీవాల మాంసం అందించడంతో దుకాణ యజమానులను అభినందించారు.

మతసామరస్యం పాటించాలి



మత పెద్దల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రాజు

పులివెందుల : రాబోవు బక్రీద్, వినాయక చవితి పండుగలను దృష్టిలో ఉంచుకొని పులివెందుల పట్టణంలోని మతపెద్దలతో అర్బన్ సీఐ రాజు పీస్(శాంతి) కమిటీ సమావేశం నిర్వహించారు. ఎస్ఐ సత్యనారాయణతో కలసి ఆయన మాట్లాడుతూ మతసామరస్యం పాటించాలని తెలిపారు. కుల,మత భేదాలకు తావివ్వకుండా అందరూ కలసిమెలసి ఉండాలని సూచించారు. పట్టణంలో హిందూ, ముస్లింల బంధం ఎప్పటికీ మరువలేనిదని ముమ్ముందు కూడా అదే విధంగా కొనసాగించాలన్నారు. మండల పరిధిలో ఎటువంటి చిన్న సమస్యలున్నా తమ దృష్టికి తీసుకవస్తే పరిష్కరించే దిశగా అడుగులు వేస్తామన్నారు. సొంత నిర్ణయాలకు పోయి ఇబ్బందులకు గురికావద్దన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ స్వామి, రైటర్ గోవిందు, హెడ్‌కానిస్టేబుల్ కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పులివెందుల టౌన్ : 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి సోమవారం నుంచి డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ బి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలలో 19వ తేదీ నుంచి 24వ తేదీలోపు ఇంటర్మీడియెట్ పూర్తయిన మహిళా విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. డిగ్రీలో బీకాం, బీఏ, బీఎస్సీ(కంప్యూటర్ సైన్స్), బీఎస్సీ(జువాలజీ) లలో సింగిల్ మేజర్ సబ్జెక్ట్‌లో ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. విద్యార్థినుల సౌకర్యార్థం కళాశాలలో హెల్ప్‌డెస్క్ ఫోన్ నంబర్: 9440433175 ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పెన్నా రహదారికి మరమ్మతులు చేయాలి

జమ్మలమడుగు : వేపరాల–జమ్మలమడుగు పెన్నా నదిలో వేసిన రహదారికి మరమ్మతులు చేయించాలని సీపీఎం కార్యదర్శి శివనారాయణ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేపరాల– జమ్మలమడుగు పెన్నా రహదారి గతేడాది వచ్చిన వరదల కారణంగా పూర్తిగా ధ్వంసం అయిందని తెలిపారు. దీంతో ఈ రహదారిపై రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. ఈ రహదారికి మరమ్మతులు చేస్తే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కావున అధికారులు వెంటనే ఈ దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

జేఈఈలో ర్యాంకు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన ఉపాధ్యాయులు అట్లా నరసింహారెడ్డి, రాజేశ్వరిల కుమారుడు హరిదీరజ్ రెడ్డికి జేఈఈ అడ్వాన్స్‌డ్–2023 పరీక్ష ఫలితాల్లో 1708వ ర్యాంకు సాధించాడు. తెలంగాణ ఎంసెట్‌లో 189వ ర్యాంకును, ఏపీ ఎంసెట్‌లో 407వ ర్యాంకును, జేఈఈ మెయిన్స్‌లో 2061వ ర్యాంకును విద్యార్థి సాధించాడు. విద్యార్థి తండ్రి స్థానిక ఎస్వీవీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, తల్లి రాజేశ్వరి వెల్లాల గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. తమ పాఠశాలలో చదివిన విద్యార్థి హరిదీరజ్‌రెడ్డి ర్యాంకు సాధించడంపై గౌతమ్ హైస్కూల్ కరస్పాండెంట్ సుధీర్‌నాయుడు హర్షం వ్యక్తం చేశారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మైదుకూరు : మైదుకూరు మండలంలోని తువ్వపల్లె వద్ద ఆదివారం సాయంత్రం చెన్నకేశవరెడ్డి అనే వ్యక్తి పురుగు మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేశాడు. దువ్వూరు మండలం నాగాయ పల్లెకు చెందిన చెన్నకేశవరెడ్డి కి మైదుకూరు మండలం శ్రీరామ్ నగర్ కు చెందిన ఓ వ్యక్తి కి మధ్య పొలం కౌలు విషయమై వివాదం ఏర్పడినట్లు తెలుస్తోంది. ఆదివారం మైదుకూరు మండలం తువపల్లె వద్ద వారిరువురి మధ్య వాగ్వాదం జరిగినట్లు సమాచారం.అక్కడే చెన్నకేశవరెడ్డి పురుగుల మందు సేవించగా సమాచారం అందుకున్న మైదుకూరు 108 వాహనం సిబ్బంది బాధితున్ని చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు.

ఉత్సాహంగా ఎన్‌సీసీ శిక్షణ శిబిరం

కడప స్పోర్ట్స్ : కడప నగరం తెలుగుగంగకాలనీలోని ఎన్‌సీసీ నగర్‌లో ప్రారంభమైన ఎన్‌సీసీ కంబైన్డ్ అన్యువల్ ట్రైనింగ్ క్యాంపు–2 ఉత్సాహంగా సాగుతోంది. క్యాంపులో కడప, చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు చెందిన 505 మంది ఎన్‌సీసీ కేడెట్స్ శిక్షణ పొందుతున్నారు. కడప 30వ ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ క్యాంపును కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ తాపా ఆదివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సమైక్యత, క్రమశిక్షణ, దేశభక్తి ధ్యేయంగా ఎన్‌సీసీ శిక్షణ కొనసాగుతుందన్నారు. భారతసైన్యంలో చేరదలుచుకునే యువతకు ఎన్‌సీసీ ఒక చక్కటి వేదిక అని పేర్కొన్నారు. ఈనెల 25వ తేదీ వరకు నిర్వహించే ఈ శిక్షణ శిబిరంలో ఎన్‌సీసీ కేడెట్స్‌కు డ్రిల్లు, ఆయుధ శిక్షణ, యోగ, మ్యాప్‌రీడింగ్ అంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అదే విధంగా తల్‌సైనిక్ క్యాంపు, రిపబ్లిక్‌డే పరేడ్‌కు వెళ్లే ఎన్‌సీసీ కేడెట్స్‌కు సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రగతి పథంలో ఎర్రగుంట్ల

- నాల్గు లేన్ల జాతీయ రహదారితో మారిన రూపురేఖలు



ఎర్రగుంట్లలో జాతీయ రహదారిలో నూతనంగా ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణం అభివృద్ధి పథంలో పయనిస్తోంది. నాల్గు లేన్ల జాతీయ రహదారితో పట్టణ రూపురేఖలు మారిపోయాయి. రాత్రిళ్లు కూడా పగలే అనే విధంగా సెంట్రల్ లైటింగ్‌తో కళకళలాడుతోంది. జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టరు మూలె సుధీర్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఎర్రగుంట్లను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నారు. అందులో భాగంగా నేషనల్ హైవే నంబరు 716 కడప నుంచి అనంతపురం వరకు నాలుగు లైన్ల జాతీయ రహదారి మంజూరు చేయించారు. ఇందుకు గాను రూ.33 కోట్ల నిధులతో ఎర్రగుంట్ల పట్టణంలో 6 కిలోమీటర్ల మేరకు పనులు పూర్తి చేశారు.

ఎన్నడూ లేని విధంగా..

జమ్మలమడుగు నియోజకవర్గంలో ఉన్న ఎర్రగుంట్ల నాపరాయి పరిశ్రమలో ప్రసిద్ధి గాంచింది. అయితే గత ప్రభుత్వ హయాంలో పాలకులు ఎర్రగుంట్లలో అభివృద్ధి పనులు చేపట్టలేదు. తర్వాత ఎమ్మెల్యే డాక్టరు ఎం.సుధీర్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపారు. ఎర్రగుంట్ల పట్టణంలో జాతీయ రహదారి నిర్మాణానికి కృషి చేశారు. అందుకు గాను ప్రత్యేకంగా రూ.33 కోట్ల నిధులు మంజూరు చేయించారు. ప్రస్తుతం జాతీయ రహదారి ఏర్పడటంతో ఎర్రగుంట్ల రూపురేఖలు మారాయి.

వలసపల్లి రహదారిలో అభివృద్ధి పనులు

ఎర్రగుంట్ల పట్టణంలోని వలసపల్లి రోడ్డును రూ.3 కోట్లతో అభివృద్ధి చేశారు. డ్రైనేజీ, సిమెంట్ రోడ్డు పనులు చేపట్టారు. దీంతో వలసపల్లి రోడ్డు రూపురేఖలు కూడా మారినవి. గతంలో వర్షం వస్తే ఇళ్లలోకి నీరు వచ్చే పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఎమ్మెల్యే డాక్టరు ఎం.సుధీర్‌రెడ్డి కృషితో డీఎంఎఫ్ నిధులతో రూ.3 కోట్లు వెచ్చించి డ్రైనేజీ, సిమెంట్ వేశారు. ఇప్పుడు ఒక్క చుక్క నీరు నిలబడటం లేదని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక కడప రోడ్డులోని వ్యవసాయ మార్కెట్ యార్డులో కోట్లాది రూపాయలతో అన్ని ఆధునిక సదుపాయాలతో నూతనంగా మున్సిపల్ భవనం పనులు కూడా పూర్తి కావచ్చాయి. ఎర్రగుంట్ల అర్బన్ హెల్త్ క్లినిక్ భవనం పనులు కూడా జరుగుతున్నాయి. అతి త్వరలోనే ప్రగతి పనులు పూర్తి అయ్యి ఎర్రగుంట్ల నూతన శోభ సంతరించుకోనుంది.



ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

జన్మదినం.. వెల్లివిరిసిన సేవా భావం



దీన బంధు ఆశ్రమంలో అన్నదానం నిర్వహిస్తున్న విద్యానందరెడ్డి

పులివెందుల : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దేవిరెడ్డి శివశంకరరెడ్డి పుట్టిన రోజు వేడుకలను ఆదివారం పులివెందులలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. లింగాల మండల వైఎస్సార్‌సీపీ నాయకులు దొండ్లవాగు విద్యానందరెడ్డి, దేవిరెడ్డి యశ్వంత్‌రెడ్డి ఆధ్వర్యంలో లింగాల మండలంలోని దీన బంధు మానసిక వికలాంగుల ఆశ్రమంలో మానసిక వికలాంగులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనార్ధనరెడ్డి, అక్కుల పల్లె కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే లింగాల మండలం ఇప్పట్ల గ్రామ సమీపంలో ఉన్న లీలావతి వృద్ధాశ్రమంలో ఆదివారం రాత్రి వృద్ధులకు విద్యానందరెడ్డి, యశ్వంత్‌రెడ్డిలు అన్నదానం చేశారు. పట్టణంలోని నగరిగుట్టలో ఉన్న వృద్ధాశ్రమంలో వైఎస్సార్‌సీపీ యూత్ విభాగం నాయకులు పోరెడ్డి జశ్వంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ హలు గంగాధరరెడ్డిలు కేక్ కట్ చేసి వృద్ధులకు పంపిణీ చేశారు. అనంతరం వారికి అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవిరెడ్డి శివశంకరరెడ్డికి మంచి జరగాలని సర్వమత ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రసూల్, సుధీకరరెడ్డి, చంద్రమౌళి, షమీ ఉల్లా, చలపతి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల నెట్ వర్క్ కార్యాలయంలో కౌన్సిలర్ సుజాత ఆధ్వర్యంలో వికలాంగులకు దుస్తులు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వికలాంగులకు పంచిపెట్టారు.

ఉత్తమ విద్యార్థులకు సత్కారం



వేంపల్లె : విద్యార్థులను సత్కరిస్తున్న బలిజ సంఘం నాయకులు



కలెక్టర్ చేతుల మీదుగా చెక్కు అందుకుంటున్న వాసంతి


వేంపల్లె : స్థానిక బలిజ సంఘం వీధిలో వెలసిన గౌరీదేవి ఆలయంలో బలిజ సంఘీయులు కోలా మారుతి ప్రసాద్ నీట్, పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు చిరు సత్కారం చేశారు. నీట్‌లో వేంపల్లెకు చెందిన పోతిరెడ్డి చెంద్రాయుడు 670, దినేష్ 645 మార్కులు సాధించగా పదో తరగతి ఫలితాలలో 550కి పైగా మార్కులు సాధించిన పది మంది విద్యార్థులకు విద్యా సామగ్రితోపాటు మెమెంటోను అందజేశారు.

విద్య ద్వారానే ఉన్నత స్థాయికి ఎదుగుతారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బలిజ సంఘం అధ్యక్షుడు కటిక చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు ఎడాల రామా, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


జిల్లాలో మొదటి స్థానం

వేముల : జిల్లా వ్యాప్తంగా కస్తూరిబా విద్యాలయాల్లో ఇంటర్ బైపీసీ గ్రూపులో వేముల కస్తూరిబా పాఠశాల విద్యార్థి వెంకట వాసంతి 1000కు 953 మార్కులు సాధించి జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ శారదమ్మ తెలిపారు. ఇందుకు జిల్లా స్థాయిలో జగనన్న ఆణిముత్యాలలో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ విజయరామరాజు చేతుల మీదుగా వెంకట వాసంతి రూ.50 వేల చెక్కు, మెడల్, ప్రశంసా పత్రం అందుకున్నారు. అలాగే ప్రిన్సిపాల్ శారదమ్మను, విద్యార్థి తల్లి తిరుమలమ్మను శాలువాతో సన్మానించి మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా డీఈఓ రాఘవరెడ్డి, జిల్లా సమగ్ర శిక్ష అధికారి ప్రభాకరరెడ్డి విద్యార్థి వాసంతిని అభినందించారు.

ముద్దనూరులో స్తంభిస్తున్న ట్రాఫిక్



ఆఫీసుల ప్రధాన రహదారిలో అడ్డంగా నిలిచిన వాహనాలు



కొన్ని రోజుల క్రితం ట్రాఫిక్‌తో ఆగిన జాయింట్ కలెక్టర్ వాహనం(ఫైల్)

ముద్దనూరు : పలు ప్రాంతాలకు కూడలి, మండల కేంద్రమైన ముద్దనూరులో నిత్యం వాహనాల రద్దీతో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. దీనికి తోడు స్థానిక పోలీసులు ట్రాఫిక్ పట్ల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక 4 రోడ్ల కూడలి నుంచి పాతబస్టాండు ఆవరణ వరకు సుమారు 1 కి.మీ. ప్రధాన రహదారిలో నిత్యం ట్రాఫిక్ అస్తవ్యస్తంగా ఉంటోంది. వాహనాల రాకపోకలు, అడ్డదిడ్డంగా ఆటోల నిలుపుదల, రహదారి వెంట తోపుడు బండ్లు, సరుకులు రవాణా చేసే వాహనాలు, ద్విచక్రవాహనాలు అడ్డదిడ్డంగా పార్కింగ్‌లతో ట్రాఫిక్ అధ్వానంగా తయారైందనే విమర్శలు వస్తున్నాయి. స్థానిక పాతబస్టాండు నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు రహదారి, కూరగాయల మార్కెట్ ప్రాంతం సర్వం వాహనాల పార్కింగ్‌తో అస్తవ్యస్తంగా మారి ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు.

రోజురోజుకూ ట్రాఫిక్ నియంత్రణ లేకుండా పోయి ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నా పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పోలీసు అధికారులు చొరవ చూపి ట్రాఫిక్ కష్టాలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

రేపు మండల స్థాయి క్రీడా పాఠశాల ఎంపికలు

వేంపల్లె : మండల స్థాయి క్రీడా పాఠశాల ఎంపికలు మంగళవారం నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి బండి వీరారెడ్డి పేర్కొన్నారు. ఈ ఎంపికల్లో పాల్గొనదలచినవారు స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉదయం 9 గంటలకు ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్‌ను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు. నాల్గవ తరగతి విద్యార్థులు 2014 ఆగస్టు నుంచి 2015 జూలై మధ్య జన్మించి ఉండాలన్నారు. ఐదవ తరగతి విద్యార్థులు 2013 ఆగస్టు నుంచి 2014 జూలై మధ్య జన్మించి ఉండాలన్నారు.

ఈ ఎంపికలకు హాజరయ్యే విద్యార్థులు తమ వెంట స్టడీ సర్టిఫికెట్, 3 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకొని రావాలన్నారు. ఎత్తు, బరువు, స్టాండింగ్, పరుగు పందెం తదితర అంశాలలో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు.